సమస్యల పరిష్కారానికే అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్

హైకోర్టు న్యాయమూర్తి జే శ్రీనివాస్‌రావు

పోతన సమాధి వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రావు

పాలకుర్తి రూరల్, ఫిబ్రవరి 3: రైతే దేశానికి వెన్నముక అని, రైతు లేనిదే దేశం లేదని హైకోర్టు న్యాయమూర్తి జే శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కుటుంబ సమేతంగా జిల్లా జడ్జి రవీంద్రశర్మతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. బమ్మెరలోని పోతనామాత్యుడి సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశమన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికే దేశంలో ఎక్కడా లేని విధంగా బమ్మెరలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. దీని ద్వారా రైతులకు చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఎవరికైనా చట్టపరంగా ఇబ్బందులు ఎదురైతే అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా పరిష్కారిస్తామని ఆయన వివరించారు. పోతనామాత్యుడు రాసిన మహా భాగవతం ఎంతో గొప్ప కావ్యమన్నారు. పాలకుర్తి, బమ్మెర, వల్మీడిమహాకవులకు పుట్టినిల్లని, ఈ ప్రాంతం పర్యాటకపరంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్‌కుమార్,ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పర్మర్ పింకేశ్‌కుమార్, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వాసం రామ్మూర్తి, తహసీల్దార్ వెంకటేశం, ఏసీపీ రఘుచందర్, సీఐ దేవనపల్లి విశ్వేశ్వర్, ఎస్సైలు తాళ్ల శ్రీకాంత్, కే శ్రావణ్‌కుమార్, మహేందర్, బీ శ్రావణ్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, వైఎస్ ఎంపీపీ దార శారద, సీతారామరాజు, అడ్వకేట్లు సాధిక్ ఆలీ, కనుకుంట్ల కన్నయ్య పాల్గొన్నారు.

జడ్జిని కలిసిన కలెక్టర్..

జనగామ రూరల్, ఫిబ్రవరి 3: జిల్లా పర్యటనకు వచ్చిన హైకోర్టు జడ్జి శ్రీనివాస్‌రావును శని వారం కలెక్టర్ నీహెచ్ శివలింగయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలి కారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సీతారాం, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధంగా ఉండాలి : ఎంపీపీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బస్వ సావిత్రి

దేవరుప్పుల, ఫిబ్రవరి 3 : విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధంగా ఉండాలని ఎంపీపీ బస్వ సావిత్రి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పోటీ పరీక్షలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ విద్యార్థులకు సులభమైన పద్ధతిలో పాఠాలు బోధించాలని సూచించారు. సంవత్సరంలో బోధించిన పాఠాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి ఉపేందర్, పాఠశాల హెచ్ఎం శ్రీలత, రాజారెడ్డి, ఎంపీటీసీ రేణుక, కాంప్లెక్స్ కార్యదర్శులు అంబటి అంజయ్య, మల్యాల రమేశ్, రాజేంద్రకుమార్, ప్రభాకర్, బాలనర్సయ్య, కిరణ్, హరిప్రసాద్, సుకుమారి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

భూదానం గొప్ప విషయం

- లక్ష్మీనర్సయ్య సేవలు అభినందనీయం
- రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తాం
- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

భూదాన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్, ఫిబ్రవరి 3: గ్రామాభివృద్ధి కోసం సొంత భూమి రెండు ఎకరాలను ఇవ్వడం గొప్ప విషయమని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వెంకిర్యాలలో మాజీ సర్పంచ్ కీర్తి లక్ష్మీనర్సయ్య వారి తల్లిదండ్రులు వెంకట్రామయ్య–రుక్కమ్మ జ్ఞాపకార్థం రూ.కోటి విలువైన రెండెకరాలను భూదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో బండా ప్రకాశ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతానికి లక్ష్మీనర్సయ్య ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ఇలాంటివి మరిన్ని జరుగాలని వారు ఆకాంక్షించారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సాగునీరు, విద్యుత్ సమస్య పరిష్కారమై రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. గ్రామాభివృద్ధి కోసం తన ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.10 లక్షలు ఇస్తానని, వీటితో స్థానికంగా అభివృద్ధి పనులు చేపట్టాలని మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ కోరారు. కుటుంబ సభ్యులంతా కలిసి గ్రామాభివృద్ధికి భూదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ స్థలంలో ఏర్పాటు చేసే కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో స్థానిక ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు నీలిమా ఆసుపత్రిలో ఐదేండ్లు ఉచితంగా వైద్యం అందిస్తానన్నారు. ఎమ్మెల్యేగా తనకు వచ్చే గౌరవ వేతనాన్ని అభివృద్ధి పనులకు వినియోగిస్తానని తెలిపారు. ప్రజలకు ఏ అవసరం ఉన్న తనను కలువాలని కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు అధికారులతో మాట్లాడుతానన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ కీర్తి లక్ష్మీనర్సయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లా స్థాయి క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనగామ ఆర్డీవో మురళీకృష్ణ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు బండ లక్ష్మీవెంకటేశం, ఎంపీటీసీ శాలమ్మ, ముదిరాజ్ మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చినబోయిన రేఖారాజు, సొసైటీ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకుడు కల్నల్ భిక్షపతి, కీర్తి వీరేందర్ ముదిరాజ్, వెంకటేశ్ ముదిరాజ్, నాయకులు పసుల ఎబేల్, రావెల రవి, మాజీ సర్పంచులు ఎర్ర సుజాత, తేజావత్ కల్యాణి, రేణుక, బానోత్ జయరాం, లచ్చిరాం, మంజుల, ముక్క రాజయ్య, తాళ్లపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భూమి పత్రాలను అందజేస్తున్న లక్ష్మీనర్సయ్య కుటుంబ సభ్యులు

గురుకుల కళాశాలలో అడ్మిషన్లకు నేడు ప్రవేశ పరీక్ష

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 3 : స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇంటర్మీడియట్‌లో 2024–2025 విద్యా సంవత్సరానికి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ కాళహస్తి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఇంటర్‌నెట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు పరీక్ష ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో ఉదయం 9గంటల వరకు పరీక్ష కేంద్రానికి హాజరుకావాలన్నారు. 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆలస్యంగా వస్తే పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని ఆయన స్పష్టం చేశారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

రఘునాథపల్లి, ఫిబ్రవరి 3: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకుని ఆదర్శంగా నిలవాలని లయన్స్‌క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు అన్నారు. శనివారం మండలంలోని ఖిలాషాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఖిలాషాపురం, జనగామ ఆబాద్ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో విద్యార్థులకు స్టీలు ప్లేట్లు, గ్లాసులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పరశురాములు మాట్లాడుతూ పేదలను ఆదుకోవడంలో లభించే సంతృప్తి వెలకట్టలేనిదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునేందుకు పూర్వ విద్యార్థులు, స్థానికులు కృషి చేయాలని ఆయన కోరారు. పాఠశాల హెచ్ఎం భగవాన్‌రెడ్డి, దాత పబ్బా చంద్రశేఖర్, భాస్యం రఘు, కృష్ణజీవన్‌బజాజ్, సురిగల భిక్షపతి, సురేశ్‌కుమార్, డాక్టర్ రమేశ్, నాసగోని పరశురాములు, వడిచర్ల ప్రవీణ్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ నాయకులు

ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి జన్మదిన వేడుకలు

పాలకుర్తిలో కేక్ కట్ చేస్తున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి/ దేవరుప్పుల, ఫిబ్రవరి 3 : ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి జన్మదిన వేడుకలను శనివారం పాలకుర్తి, దేవరుప్పుల మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. పాలకుర్తిలో కేక్ కట్ చేసి ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామిగౌడ్, ఎంపీటీసీ కమ్మగాని పుష్పలత, హరీశ్ పాల్గొన్నారు. దేవరుప్పులలో జరిగిన కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్లా శ్రీరాం, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సురేశ్, ఆవుల సురంజన్‌రెడ్డి, తోటకూరి కృష్ణ, ఇనుముల నాగరాజు, రామచంద్రు, భాగాల మాలతి, అనిల్, రమేశ్, రెడ్డిరాజుల రమేశ్, సురేశ్, ఉప్పుల ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

7నుంచి గ్రామాల్లో పారిశుధ్య పనులు

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క ఆదేశం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శివలింగయ్య, అధికారులు

జనగామ రూరల్/బచ్చన్నపేట, ఫిబ్రవరి 3: ప్రత్యేక అధికారులు గ్రామాల్లో అభివృద్ధి పనులు పర్యవేక్షించాలని, ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్ శివలింగయ్య, వివిధ శాఖల అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయినందున ఎన్నికలు వచ్చే వరకూ ప్రత్యేక అధికారులు నిరంతరం గ్రామాలను పర్యవేక్షించాలని కోరారు. వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా కార్యాచరణ రూపొందించాలన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ శివలింగయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రత్యేక అధికారుల ద్వారా గ్రామ పంచాయతీల పాలన నిర్వహిస్తామని వారికి పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈర్యాక్రమంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి, డీఆర్డీవో మొగులప్ప, జడ్పీ సీఈవో అనిల్ కుమార్, వివిధ శాఖల అధికారులు చంద్రశేఖర్, శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ప్రత్యేకాధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి బచ్చన్నపేట మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులు, పల్లెప్రకృతివనాలు, క్రీడాప్రాంగణాలు, నర్సరీల నిర్వహణ చూడాలని సీతక్క కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్, తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణ, ప్రత్యేకాధికారులు విద్యాకర్‌రెడ్డి, శ్రీనివాస్, వేణుగోపాల్, రామారావు, హన్మంతు, ఖాసీం, రాజు, పంచాయతీ కార్యదర్శులు అనిల్‌రాజ్, ప్రశాంత్ఆచార్యా, రాధాకృష్ణ, రూపాచైతన్య, కవిత, రేవతిగౌడ్, కిరణ్, కరుణాకర్, రాజశేఖర్, భరత్, భానుచందర్, సతీష్‌రెడ్డి, సౌజన్య, వెంకటేశ్, చారి, మధు, ఉపేందర్, దేవీప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

జిల్లా విద్యాశాఖాధికారి రాము

బచ్చన్నపేట : ప్రజ్ఞోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాలకుర్తి, ఫిబ్రవరి 3: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. శనివారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో మండల స్థాయి ప్రజ్ఞోత్సవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు నృత్యాలు, పాటలు, డ్రాయింగ్‌తో పాటు 11 విభాగాల్లో పోటీపడ్డారు. అనంతరం విజేతలకు డీఈవో రాము బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య, డీసీఈబీ సెక్రటరీ చంద్రభాను, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రటరీ రామరాజు, హెచ్ఎంలు శోభారాణి, వెంకటేశ్వర్లు, అశోక్, రాజిరెడ్డి, మల్లయ్య, గిరిధర్ పాల్గొన్నారు.

ప్రజ్ఞోత్సవంలో విద్యార్థుల ప్రతిభ

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని ఇందిరా నగర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రజ్ఞోత్సవానికి ఆయా గ్రామాలకు చెందిన ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు తరలివచ్చారు. ఈ సందర్భంగా కథల పోటీలు, చదవడం, రాయడం, స్టోరీ టెల్లింగ్, రీడింగ్, స్పెల్ విజర్డ్, మ్యాథ్స్, డ్రాయింగ్, సోలోసాంగ్ అంశాలపై పోటీలు నిర్వహించారు. ప్రజ్ఞోత్సవాలకు కన్వీనర్‌గా నోడల్ అధికారి మూర్తి, కోకన్వీనర్లుగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నీల వేణు, కృష్ణమోహన్, సంధ్యారాణి వ్యవహరించారు. ఉపాధ్యాయులు శ్యాం మోహన్, రాఘవమూర్తి, సురేశ్, పరశురాము లు, సత్యవర్ధన్, సద్గుణాచారి పాల్గొన్నారు.



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

పాలకుర్తి, ఫిబ్రవరి 3: మండలంలోని చెన్నూరు మహర్షి విద్యా మందిర్‌లో శనివారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. మరికొందరు మండల, జిల్లా విద్యాశాఖ అధికారులుగా వ్యవహరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి విద్యా ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. స్వయంపాలనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ నరేందర్, ఉపాధ్యాయులు భుజంగరావు, గిరగాని సమ్మయ్య గౌడ్ పాల్గొన్నారు.

బైక్‌ను కారు ఢీకొని వ్యక్తి మృతి

ఘటనా స్థలం వద్ద తీవ్ర గాయాలతో స్వరూప

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 3 : బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన చిల్పూరు మండలం వెంకటాద్రిపేట సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిల్పూరు మండలం వాచ్యతండాకు చెందిన భాస్కర్(25) సోదరి స్వరూపతో శనివారం బైక్‌పై మల్కాపూర్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో మల్కాపూర్ నుంచి వెంకటాద్రిపేట వైపు వేగంగా వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందగా, స్వరూపకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని చికిత్సకోసం దవాఖానకు తరలించినట్లు బంధువులు తెలిపారు.

భారీగా నల్లబెల్లం, పటిక పట్టివేత

నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పాలకుర్తి, ఫిబ్రవరి 3: అక్రమంగా నల్లబెల్లం, పటిక తరలిస్తున్న వాహనాన్ని ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేసి నిందితుడిని అరెస్ట్ చేసిన ఘటన మండలంలోని శాతాపురం క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో శనివారం మండలంలో తనిఖీలు నిర్వహించారు. శాతాపురం క్రాస్‌రోడ్డు వద్ద బొలెరో వాహనంలో 40క్వింటాళ్ల నల్లబెల్లం, క్వింటా పటిక, 20లీటర్ల నాటు సారాను తరలిస్తుండగా పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా నుంచి మహబూబాబాద్ జిల్లా కేసముద్రానికి వీటిని రవాణా చేస్తున్నారని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నల్లబెల్లం, పటికతోపాటు వాహనాన్ని సీజ్ చేసి నిందితుడు గుగులోత్ రమేశ్‌ను అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై మధువర్మ, పాలకుర్తి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌రెడ్డి, సిబ్బంది రవీందర్, కరుణాకర్, సంజీవ్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న దాతలు

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత

బచ్చన్నపేట, ఫిబ్రవరి 3 : మండలంలోని కేశిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం గ్రామానికి చెందిన దామెర లక్ష్మయ్య జ్ఞాపకార్థం ఆయన కుమార్తెలు కల్పన, మాధవి, స్వప్న నోట్‌బుక్స్, పరీక్ష ప్యాడ్లు, కంపాస్‌బాక్స్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల కోసం రూ.10వేల విలువైన విద్యా సామగ్రి అందించామన్నారు. హెచ్ఎం కేశవ్ మాట్లాడుతూ విద్యార్థులకు సాయం అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సత్తిరెడ్డి పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 3 : ఈ నెల 11,12 తేదీల్లో ఖమ్మంలో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బందారపు లక్ష్మయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మహ్మద్ అంకుషావళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో లక్ష్మయ్య మాట్లాడుతూ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ప్రతినిధులు ఆర్ యాదగిరి, సత్తిరెడ్డి, శ్రీనివాస్, సత్యవర్ధన్, పద్మకుమారి, ఐలయ్య, మహేందర్‌రెడ్డి, గొట్టె కనకయ్య, రమేశ్, మధుసూదన్ పాల్గొన్నారు.

టీఆర్‌వీకేఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా మహేందర్

పెరుమాళ్ల మహేందర్

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 3 : తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం(టీఆర్‌వీకేఎస్) స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ అసిస్టెంట్ పెరుమాళ్ల మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి టీఆర్‌వీకేఎస్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామన్నారు. తనకు ఈ పదవి లభించేలా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

'దళితబంధు'కు నేను పైసా తీసుకోలె..

- కావాలనే కొందరు కుట్రలు చేస్తున్నరు
- జనగామ మాజీ ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ, నమస్తే తెలంగాణ 3: దళితబంధు పథకంలో తాను డబ్బులు వసూలు చేసినట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. శనివారం జనగామలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2003లో ఉద్యమ నేత కేసీఆర్ పిలుపు మేరకు నాడు పార్టీలోకి వచ్చినట్లు చెప్పారు. పార్టీ కోసం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ఆస్తులు అమ్ముకుని ఎంతో ఖర్చు చేశానన్నారు. అలాంటి నాపై కొందరు కావాలనే కుట్రలు చేస్తున్నారని ముత్తిరెడ్డి వాపోయారు. టీఆర్ఎస్‌లో చేరిన తర్వాత 2004లో వర్ధన్నపేటలో పోటీ చేస్తే 59,500 ఓట్లు వచ్చాయని వివరించారు. తర్వాత పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పని చేశానని, తర్వాత ఉప్పల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయానన్నారు. జనగామలో టీఆర్ఎస్ బలహీనంగా ఉన్న సమయంలో పార్టీ అధినేత తనను ఇక్కడికి పంపారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు పార్టీలో ఉంటూ పని చేస్తున్నానన్నారు. తమ్ముడు పల్లా గెలుపు కోసం పని చేసినట్లు ముత్తిరెడ్డి చెప్పారు.

తన కుటుంబ సమస్యను సాకుగా చూపి జనగామ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదని ముత్తిరెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ స్వయంగా పిలిచి మాట్లాడి ఆర్టీసీ చైర్మన్ పదవి ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత ఎంపీ ఎన్నికల నేపథ్యంలో తాను మల్కాజ్‌గిరి టికెట్ ఆశిస్తున్నట్లు ముత్తిరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో తనను దెబ్బతీసేందుకు బద్దిపడిగే కృష్ణారెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. నియోజకవర్గంలో దళిత బంధులో ఒక్క రూపాయి అవినీతి జరగలేదన్నారు. కేవలం మద్దూరులో మాత్రమే బద్దిపడిగ కృష్ణారెడ్డి తన పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నాడని పార్టీ మండల అధ్యక్షుడు మంద యాదగిరి అప్పట్లో తనకు చెప్పినట్లు ముత్తిరెడ్డి వివరించారు. ఆ సమయంలో తాను జనగామ, చేర్యాలలో ప్రెస్‌మీట్ పెట్టి ఎలాంటి అవినీతి జరగకూడదని చెప్పానని గుర్తు చేశారు.అలాంటి తాను రూ.62లక్షలు వసూలు చేశానని చెప్పడం సరికాదన్నారు.

పార్టీ కోసం ఎంతో ఖర్చు పెట్టిన తనపై పార్టీలోని కొందరు వ్యక్తులే ఇలాంటి అసత్యపు ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ సమస్యను పరిష్కరించి పార్టీని కాపాడాలని ముత్తిరెడ్డి కోరారు. ఈ సమావేశంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, చేర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మిద్దెపాక లెనిన్, కుమార్, దళిత బంధు లబ్ధిదారులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★WGL–HYD Highway కి Prime Locations లో DTCP Approved Plots కలవు. Site Visit కొరకు సంప్రదించండి. Call: 7095422395
NTW-000

HOUSE FOR SALE
★Prime Location, Near Water Tank, Nakkalagutta,